క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ సమావేశం

మంగళగిరి: మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంబడి ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పట్టణ కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు పార్టీ పట్టణ కన్వీనర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పలువురు నాయకులు పాల్గొంటారని తెలిపారు.

నేడు బ్రాహ్మణ అర్చక సమాఖ్య సమావేశం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మండల బ్రాహ్మణ అర్చక సమాఖ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు సమాఖ్య అధ్యక్ష , కార్యదర్శులు దివి వరప్రసన్నమూర్తి, రావూరి పూర్ణచంద్రశాస్త్రిలు శనివారం తెలిపారు. సమాఖ్యలో పలు అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు.

మినీ గోకులాలకు 39 దరఖాస్తులు

ఫిరంగిపురం: మండలంలోని 18 గ్రామాల పాడి రైతులు మినీ గోకులాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు నుదురుపాడు పశు వైద్యాధికారి పీర్ అహ్మద్ శనివారం తెలిపారు. ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి ఈ పథకం ప్రవేశ పెట్టిందని, 39 మంది దరఖాస్తు అందజేశారని చెప్పారు.

రోడ్డు భద్రతపై అవగాహన



తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఏఐ, డీఎస్ విభాగం ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం పెదవడ్లపూడి గ్రామంలో రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. నిబంధనలు పాటించనందున వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. వలంటీర్లను, ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి. సురేష్‌లను వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డీన్‌లు డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి తదితరులు అభినందించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లు సీజ్



లింగాయపాలెం(తాడికొండ): తుళ్ళూరు మండలం లింగాయపాలెం గ్రామంలో అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 9 ట్రాక్టర్లను తుళ్ళూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అంకమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడులలో కేసులు నమోదు చేసి తహసీల్దార్ కోర్టులో హాజరు పరచగా.. ఒక్కో ట్రాక్టరుకు రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు షాహీరా



తెనాలిఅర్బన్: రాష్ట్రస్థాయి అండర్-19 నెట్ బాల్ పోటీలకు తెనాలి కొత్తపేటలోని బాయ్స్ హైస్కూల్ విద్యార్థిని షేక్ షాహీరా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాబీ తెలిపారు. చిలకలూరుపేటలోని ఏఎంజీ జూనియర్ కళాశాలలో శనివారం ఎంపిక జరిగిందని చెప్పారు. విద్యార్థిని పాఠశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

చందోలు(కర్లపాలెం): ఓ వ్యక్తిపై ఇరువురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచిన సంఘటన పిట్టలవానిపాలెం మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందోలు ఎస్ఐ స్వామి శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు ఖాజీపాలెం పంచాయతీ మండే వారిపాలెంకు చెందిన బడుగు దీనారావుపై అదే గ్రామానికి చెందిన దండమూడి ఆశీర్వాదం, దోనేపాటి శోభన్‌లు గత నెల 31వ తేదీ రాత్రి దాడిచేసి గాయపరిచారని తెలిపారు. దీనారావు బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



ప్రకాశం బ్యారేజ్ నుంచి వివిధ ప్రాంతాలకు సాగు, తాగునీరు కోసం కాలువలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా పలు చెరువులు, కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. పాఠశాలలకు సెలవు రోజుల్లో పిల్లలతోపాటు మరికొందరు సరదాగా గడిపేందుకు తల్లిదండ్రులకు ఏదో ఒకటి చెప్పి ఈతకు వెళ్తున్నారు. అజాగ్రత్తగా వ్యవహరించి ప్రమాదాలకు గురి అవుతున్నారు. తల్లిదండ్రులకు తీరని గుండె కోత మిగులుస్తున్నారు.

గుండె కోత!

- అజాగ్రత్తతో నీట మునిగి నిండు ప్రాణాలు బలి
- నదులు, కాలువల్లో పెరుగుతున్న ప్రమాదాలు
- ఆహ్లాదం కోసం వెళ్లి అంతలోనే మృత్యువాత
- పిల్లల విషయంలో కన్నవారికి అప్రమత్తత ముఖ్యం



కృష్ణా నదిలో మృతి చెందిన చిన్నారి (ఫైల్)



చిన్నారి చనిపోవడంతో విలపిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

తాడేపల్లి రూరల్: జిల్లా వ్యాప్తంగా పలువురు యువకులు, విద్యార్థుల ఈత సరదా పలుమార్లు ప్రాణాలు తీస్తోంది. కృష్ణా నదికి ఈతకు వచ్చి లేదా నదికి అనుసంధానంగా ఉన్న కాలువల్లోకి దిగి ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరిగింది. సెలవు రోజుల్లో పిల్లలు ఎక్కడికి వెళుతున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించకపోవడంతో చాలామంది నీట మునిగి మృత్యువాత పడుతున్నారు.

ఎన్నో కుటుంబాలకు కన్నీరే

మూడు రోజుల క్రితం విజయవాడకు చెందిన ఓ విద్యార్థి, యువకుడు సరదాగా సాయంత్రం సమయంలో కృష్ణానది నీటిలో ఈతకు దిగారు. కుటుంబ సభ్యులకు కడుపుకోత మిగిల్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే నిత్యం ఎక్కడో ఓ చోట ఇలాంటి మరణాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. కృష్ణానది ఎగువ ప్రాంతంలో పాత ఇసుక రేవు దగ్గర ఈత రాకుండా ఒక కుటుంబం నీటిలోకి దిగగా, ఆ కుటుంబానికి చెందిన కుమార్తె, కుమారుడు మృతి చెందారు. ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. ఈత వచ్చిన వారితో పాటు రాని వారు కూడా సరదాగా నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈత రాని వారు నదులకు, కాలువలకు దూరంగా ఉండడం మంచిది. కృష్ణానది ఎగువ, దిగువ ప్రాంతాల్లో చుట్టం చూపుగా వచ్చిన ఎంతోమంది చిన్నారులు ఈత సరదాతో నదికి వెళ్లి మృత్యువాత పడుతున్నారు. గుంటూరు వెంకటరెడ్డి పాలెంకు చెందిన బీటెక్ విద్యార్థి మహానాడులోని బంధువుల ఇంటికి వచ్చి పిల్లలతో కలిసి నదికి వెళ్లాడు. అక్కడి నీటి గుంటలో పడి మృతి చెందాడు. విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలలకు సెలవులు కావడంతో సరదాగా ఈతకు వచ్చారు. అందులో ముగ్గురు మృతి చెందగా.. ఒక బాలుడు గల్లంతయ్యాడు. ఇప్పటికీ ఆ బాలుడి ఆచూకీ లభించలేదు. అతడి తల్లిదండ్రులు తమ కుమారుడు బతికి ఉన్నాడా? చనిపోయాడా? అనేది తెలియక రోజూ పుత్రశోకంతో విలపిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా చిన్నారులు ఈత సరదాతో కాలువలకు, నదులకు వెళ్తున్నారు. ఒకరికో, ఇద్దరికో ఈత రావడం, వారి భరోసాతో నీటి లోపలకు వెళ్తుండటంతో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. స్నేహితులతో బయటకి పంపిస్తే ఎవరితో వెళుతున్నారు... ఎక్కడికి వెళుతున్నారో కచ్చితంగా తల్లిదండ్రులు తెలుసుకోవాలి.

కన్నవారే జాగ్రత్తగా ఉండాలి



సరదాగా ఈతకు వెళ్లి చిన్నారులు, యువకులు ఎంతోమంది నదులు, కాలువల్లో దిగి మృతువాత పడుతున్నారు. పిల్లలకు ఈత అంటే సరదా. ఎక్కడున్నా ఈత నేర్పించే సెంటర్లకు పంపితే మంచిది. వారి కోర్కెలను మనం గుర్తించకపోవడం వల్లే చాలామంది ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లి మృత్యువాత పడుతున్నారు. ఆక్వా డెవిల్స్ వంటి సంస్థలో ప్రతి సంవత్సరం ట్రైనింగ్ పొందిన ఈతగాళ్లతో శిక్షణ ఇస్తున్నారు. మంగళగిరి కార్పొరేషన్‌లో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశారు. అలాంటి కేంద్రాలకు ముందు మన పిల్లలను పంపి ఈత నేర్పించాలి.

– ప్రముఖ స్విమ్మర్ రామకృష్ణ

అప్రమత్తత తప్పనిసరి



సెలవుల్లో విద్యార్థులు ఇంట్లో ఉన్నప్పుడు ఈతకు ఎక్కువగా వెళ్తుంటారు. వారు ఎక్కడకు వెళ్తున్నారనేది కుటుంబ సభ్యులు నిత్యం గమనిస్తూ ఉండాలి. ప్రమాదాలు నివారించేందుకు కృష్ణానది తీరంతోపాటు పలు ప్రాంతాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బోర్డులు ఏర్పాటు చేశాం. పుష్కర ఘాట్ల వద్ద పోలీసులు కాపలా కూడా పెట్టాం. ఏదో ఒక చోట యువకులు, విద్యార్థులు నీటిలోకి దిగి మృత్యువాత పడుతున్న ఘటనలు నిత్యకృత్యం అయ్యాయి. అధికారులతోపాటు తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరిస్తే ఇలాంటి ప్రమాదాలు నివారించవచ్చు.

– తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు

రీ సర్వేతో రైతుల భూమికి హామీ

తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు

పల్లెకోన(భట్టిప్రోలు): భూముల రీ సర్వేలో లోపాలు సవరించేందుకు రెవెన్యూ సదస్సులు దోహద పడతాయని తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు అన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలో శనివారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీ సర్వేలోని లోపాలను సవరించడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి రైతు ఈ గ్రామ సభలు సద్వినియోగం చేసుకుని అవగాహన పెంచుకోవాలని సూచించారు. గ్రామ సభలో 6 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, మాజీ సర్పంచులు రాయన ప్రసాదరావు, మండవ రామకోటేశ్వరరావు, మండల సర్వేయర్ బి.శ్రీనివాసరావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.



పల్లెకోనలో రీ సర్వే గ్రామ సభలో పాల్గొన్న తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు

12న సుందరాంజనేయ ఆలయ వార్షికోత్సవం

పడమటిపాలెం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురం పంచాయతీ పరిధిలోని పడమటిపాలెంలో కొలువైన సుందరాంజనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవం నవంబర్ 12వ తేదీన నిర్వహించనున్నట్లు దేవాలయ మేనేజింగ్ ట్రస్టీ, విశ్రాంత ఐఏఎస్ అధికారి పడమటి సుందరకుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు విశేష పూజలు, హనుమత్ కల్యాణం, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో 33 అడుగుల ఎత్తు గల ఈ విగ్రహాన్ని 2008లో ప్రతిష్ఠించారు. గ్రామస్తుల కోరిక మేరకు పడమటి సుందర కుమార్ విగ్రహంతో పాటు ప్రజల సహకారంతో దేవాలయాన్ని కూడా నిర్మించారు. ఈ ఆలయ ప్రారంభం నుంచి ఈ ప్రాంతం పాడి పంటలతో సుభిక్షంగా విలసిల్లుతుందని భక్తుల నమ్మకం. మహోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని సుందరకుమార్ తెలిపారు.



పడమటిపాలెంలోని సుందరాంజనేయ స్వామి వారి దేవాలయం

దశలవారీగా ఆక్రమణలు తొలగింపు

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రెయిన్ల మీద ఆక్రమణలను దశలవారీగా తొలగిస్తామని, అమరావతి రోడ్ ఇరువైపులా ఆక్రమణలను స్పెషల్ డ్రైవ్ చేపట్టి తొలగిస్తున్నామని, ఆక్రమణలు తొలగించిన వెంటనే డ్రెయిన్లలో పూడిక కూడా తీయాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ లాడ్జి సెంటర్ నుంచి హోసన్నా మందిరం వరకు చేపట్టిన డ్రెయిన్, రోడ్ ఆక్రమణల తొలగింపు పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్లు, రోడ్లు ఇష్టానుసారంగా ఆక్రమణలు చేయడం వలన డ్రెయిన్లలో పూడిక తీయడానికి వీలు లేకుండా పోయిందన్నారు. డ్రెయిన్ ముందుకు ఏ విధమైన షాప్‌లు, బండ్లు పెట్టడానికి వీలు లేదని స్పష్టం చేశారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్ సత్యనారాయణ, ఏఈ చైతన్య పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

ఎస్‌హెచ్‌బీ ప్రొఫైలింగ్ యాప్‌పై అవగాహన ఉండాలి

తెనాలిఅర్బన్: ఎస్‌హెచ్‌బీ ప్రొఫైలింగ్ యాప్ పై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయ అధికారి ఐబీ పద్మజ సూచించారు. పురపాలక సంఘ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో శనివారం స్మల్ లెవల్ ఫెడరేషన్ రిసోర్స్‌పర్సన్‌లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వయం సహాయ సంఘ సభ్యుల వివరాలను యాప్‌లో పొందుపరచాలని సూచించారు. అలాగే వారి రుణాలకు సంబంధించిన వివరాలను కూడా దానిలో నమోదు చేయాలని సూచించారు. దీనికి సంఘ సభ్యులందరూ సహకరించాలని తెలిపారు.

పట్టణ సుందరీకరణలో భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, ఏసీ లక్ష్మిపతి

తెనాలిఅర్బన్: పట్టణ సుందరీకరణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పిలుపునిచ్చారు. పట్టణంలో 1,3,9 వార్డులలో శనివారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. అలాగే మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మిపతి, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో కారుమూరు గ్రామంలో తమ సిబ్బంది దాడులు నిర్వహించారన్నారు. దాడుల్లో గ్రామ బస్‌షెల్టర్ సమీపంలో గ్రామానికి చెందిన సమ్మెట వెంకట్రావు మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతని వద్ద 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

కార్తికమాసం పద్యకుసుమం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన వేణుగోపాలరావు

తెనాలి: పట్టణానికి చెందిన కవి, రచయిత డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు రూపొందించిన కార్తికమాసం నిత్య పద్య కుసుమం పఠన గ్రంథాన్ని శుక్రవారం రాత్రి స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆవిష్కరించారు. దేవస్థానం పాలకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన ఈ పుస్తకాన్ని కమిటీ అధ్యక్షుడు నూకల వేంకట వేణు గోపాలరావు ఆవిష్కరించారు. అందులోని పద్యాలను గానకళారత్న వెంపటి సత్యనారాయణ గానం చేశారని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథి వెంకట విశ్వేశ్వరరావు, మద్దాళి శేషాచలం, వుప్పల వరదరాజులు, మాలేపాటి హరిప్రసాద్, పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, ఈఎల్‌వీ అప్పారావు, కె.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివారావు, జి.రామకృష్ణ, ఆర్.జగదీష్‌చంద్రశర్మ పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై కేసులు ఎత్తేయాలి

అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై బైండోవర్ కేసులను ఎత్తివేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయం వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికులకు న్యాయంగా రావాల్సిన పరిహారం వెంటనే అందజేయాలన్నారు. ఫ్యాక్టరీ స్థలాల్లో పక్కా ఇల్లు నిర్మాణం చేపట్టాలని తీర్మానించామని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ.. కార్మికులను ఇబ్బంది పెడుతూ యాజమాన్యం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికులు రూ. 450 కోట్లు కోరుతున్న సంగతి గుర్తు చేశారు. ఇప్పటి వరకు 160 మంది కార్మికులు చనిపోయినా యాజమాన్యం స్పందించక పోవడం విచారకరమని అన్నారు. స్థానికులు కూడా కార్మికులకు సంఘీభావంగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్మికులకు తాము అండగా ఉంటామని చెప్పారు. రైతు సంఘం నాయకుడు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ... కార్మికుల పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని కోరాఉ. వైస్సార్‌టీయూ నాయకులు దర్శి రమేష్ మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి సహకారం ఉంటామని హామీ ఇచ్చారు. ఐఎన్‌టీయూసీ నాయకులు దర్శనపు సామెల్ మాట్లాడుతూ.. సీఐటీయూ మద్దతు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు టి. వెంకటయ్య, కె. ఆదినారాయణ, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కె. కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐద్వా తాడేపల్లి పట్టణ కార్యదర్శి ఎస్ గిరిజ, డీవైఎఫ్ఐ నాయకులు దర్శనపు విజయబాబు, ప్రజా సంఘాల నేతలు బూరగ వెంకటేశ్వర్లు, గాదె సుబ్బారెడ్డి, సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీఫెన్, కార్మికులు ఎం. ఆశీర్వాదం, బి. అంకయ్య, బి. సూర్యప్రకాష్, పిచ్చయ్య, వై.సుబ్బారావు, ఎస్.కె. రహితుల్లా, వి.శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అసైన్డ్ రైతుల వినతి



సీఆర్‌డీఏ కమిషనర్‌కు ఇబ్బందులను వివరిస్తున్న రైతులు

తాడికొండ: తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామంలోని అసైన్డ్ రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం తుళ్ళూరులోని హెచ్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ప్రతినిధుల బృందంతో సమావేశం అనంతరం రైతులు కమిషనర్‌ను కలిశారు. సుమారు 400 మంది అసైన్డ్ రైతులు ఉండగా.. కౌలు డబ్బులు జమ కావడం లేదన్నారు. ఇంకా పూలింగ్‌కు భూమి ఇచ్చే వారున్నారని.. ఆ ప్రక్రియ ముగిసిన తర్వాత అందరికీ సమాన ప్యాకేజీ అందించి న్యాయం చేయాలన్నారు. భూములిచ్చిన వారికి ఇంతవరకు ప్లాట్లు కేటాయించలేదని తెలిపారు. కోర్టులో కేసులు పెండింగ్‌లో ఉన్నందున కొంత జాప్యం జరుగుతోందని, వీలైనంత త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



నిత్యావసరాల కిట్లు పంపిణీ చేస్తున్న విజయరాణి, సాల్మన్‌రాజు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని, పేద విద్యార్థుల చదువులు, కుటుంబ అవసరాల అభివృద్ధి కోసం ల్యాంప్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఉపయుక్తంగా ఉంటాయని బుద్ధా కిడ్స్ డైరెక్టర్ విజయరాణి అన్నారు. శనివారం జోసెఫ్‌నగర్, కేవీపీ కాలనీలోని జెడ్పీ హైస్కూల్లో పేద అనాథ, దివ్యాంగ బాల, బాలికలకు న్యూట్రిషన్ సపోర్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, ల్యాంప్ సంస్థ సేవలను ఉపయోగించుకుని, కలలను సాధించుకోవాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ దివ్యాంగ బాలలు, పేద విద్యార్థులను ఉన్నత స్థితిలో నడిపించడంతో పాటు కుటుంబాలను అభివృద్ధి చేయడమే సంస్థ ధ్యేయమని అన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ వేంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద, అనాథ పిల్లలు, కుటుంబాల కోసం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈసందర్భంగా 30 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ల్యాంపు సంస్థ కార్యాలయ మేనేజర్ బాజీ, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎం.దేవపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

6న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నవంబర్ 6 తేదీన కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ధర్నా పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థి దీవెన వసతి దీవెనలు వెంటనే విడుదల చేయాలని, జీఓ నంబర్ 77ను వెంటనే రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులకు మేజర్, మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను రూ.3,000లకు పెంచాలని, మెడికల్ సీట్ల అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని, 107,108, జీఓలను వెంటనే రద్దు చేయాలని కోరారు. గుంటూరు నగరంలోని కోడిగుడ్డు సత్రం హాస్టల్ వెంటనే ప్రారంభించాలని ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

హాస్టల్ వాచ్‌మెన్‌ను విధుల నుంచి తొలగించాలి

లక్ష్మీపురం: పెదనందిపాడు మండలంలోని ఎస్సీ బాలుర హాస్టల్లో ఉంటూ జెడ్పీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులపై వాచ్‌మెన్ దాడి చేయడాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్ ఖండించారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారుల వైఫల్యం వలనే ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు. విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యదర్శి అమర్నాథ్, నగర అధ్యక్షులు సాయి పాల్గొన్నారు.

ఘనంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి

లక్ష్మీపురం: తెలుగులో తిరిగి పోతన కవిత్వాన్ని స్ఫురణకు తెచ్చిన భావ కవి చక్రవర్తి, వక్తగా, మానవతావాదిగా, దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒక విశిష్ట స్థానం సంపాదించుకున్నారని సినీ దర్శకుడు కె.జయకుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం అవగాహన మనము పాడుదాం! రండి బృందం ఆధ్వర్యంలో కవి చక్రవార్తి కృష్ణశాస్త్రి జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ సీనియర్ సభ్యులు ఇ. భరత్ రెడ్డి పాల్గొన్నారు.

గుంటూరు నగరానికి ఉపయోగపడని రాజధాని

రాజధాని మూలంగా గుంటూరు నగరానికి ఉపయోగం లేకుండా పోయిందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం విడిపోయి పది సంవత్సరాలు గడిచినా గుంటూరు నగరంలో ఉన్న సుమారు 12 లక్షల జనాభాకు కనీస పౌర సదుపాయాలు లేవన్నారు. ఒక రవాణా వ్యవస్థ లేదని,అనువైన అంతర్గత రహదారులు లేవని ఆరోపించారు.